
సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



పర్యాటకం.. పరిహాసం!

గద్వాల జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

వివరాలు 8లో ▸



ప్రజల దృష్టి మళ్లించేందుకే..

ప్రజల దృష్టి మళ్లించేందుకు హైడ్రాను తెర పైకి తెచ్చారని ఎంపీ డీకే అరుణ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం **36.1 /21.8**

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ కావాలి

మహబూబ్‌నగర్ క్రైం: చిన్నపాటి కేసులతో జీవితాలు నాశనం చేసుకోరాదని, ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఆయా కేసుల్లో రాజీకావాలని ఎస్పీ జానకి అన్నారు. ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై సోమవారం ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో రాజీ అయ్యే విధంగా పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. రాజీపడే కేసులలో రెండు వర్గాలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చి లోక్ అదాలత్‌కు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కేసులలో ఉన్న ముద్దాయిలతోపాటు బాధితులకు కేసు తీవ్రతతోపాటు రాజీ కావడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పెట్టి కేసులు, డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ చలాన్, చిన్నపాటి గొడవ కేసుల అన్నింటికీ పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జేపీఎన్‌సీఈలో స్కిల్ డెవలప్‌మెంట్ సదస్సు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో విద్యార్థులకు స్కిల్‌డెవలప్‌మెంట్, లైఫ్‌స్కిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఎస్వీఎస్ రేడియాలజిస్టు దేవికా బాదామి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు రేడియాలజీలో వస్తున్న మార్పులు, వాటి పరిధిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న సాంకేతికత నేపథ్యంలో ఆల్ట్రాసౌండ్, ఎంఆర్‌ఐ తదితరాలు మానవ జీవితంలో ఎంతో కీలకంగా మారాయన్నారు. అలాగే రోగాల నిర్ధారణలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గురురాఘవేందర్ రెడ్డి, సందీప్, రాధిక, రాకేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'పాలమూరు' సందర్శనకు మంత్రులు



సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పురోగతిని సమీక్షించి పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో కలసి బుధవారం పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పనులను పరిశీలించనున్నారు. ప్రాజెక్ట్ కింద నిర్మించిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లు, పెండింగ్‌లో ఉన్న టన్నెల్ నిర్మాణం, పంప్‌హౌస్‌ల్లోని మోటార్ల బిగింపు తదితర పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి తెలుసుకోనున్నారు. ప్రాజెక్ట్ పెండింగ్ పనులతో కలిపి పూర్తి నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసి సీఎం రేవంత్‌రెడ్డికి నివేదించనున్నారు. పాలమూరు ప్రాజెక్ట్ పనులు ఏడాది కాలంగా నిలిచిపోగా, తాజాగా మంత్రుల పర్యటన నేపథ్యంలో పనుల ప్రారంభంపై అంచనాలు నెలకొన్నాయి.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,569

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డుకు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి 3,908 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. క్వింటాల్ గరిష్ఠంగా రూ.2,569, కనిష్ఠంగా రూ.1,203 ధరలు లభించాయి. అదేవిధంగా మినుములు రూ.6,570, జొన్నలు గరిష్ఠంగా రూ.2,017, కనిష్ఠంగా రూ.1,810 ధరలు లభించాయి.



'గండేడ్ మండల పరిధిలోని పెద్దవార్వాల్ గ్రామానికి చెందిన కటికె బాల్‌రాజ్(52) గతేడాది జూన్ 11న తన భార్య జమునబాయితో కలసి మేకలను మేపేందుకు వెళ్లాడు. పిడుగుపడి బాల్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అనారోగ్యానికి గురికాగా, వీరికి చెందిన 30 మేకలు సైతం మరణించాయి. పంక్చర్ షాపుతో పాటు మేకలతో జీవనోపాధి పొందుతున్న ఈ కుటుంబంలో పిడుగుపాటు తీరని నష్టాన్ని మిగిల్చింది.




'నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలకేంద్రానికి చెందిన ఈ మహిళ పేరు కొయ్యల బాలచంద్రమ్మ. ఈమె భర్త చిన్న లింగయ్య పశువులు మేపేందుకు గ్రామ సమీపంలోని నక్కల గుట్ట అటవీ ప్రాంతానికి వెళ్లగా పిడుగుపడటంతో చనిపోయాడు. వీరికి నలుగురు పిల్లలు కాగా, వారిలో ఇద్దరు దివ్యాంగులు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ఈమె భర్త అకాల మరణంతో కుటుంబం ఇబ్బందుల్లో పడింది. ప్రభుత్వం త్వరగా ఆర్థిక సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.'



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్‌కి చెందిన కొమ్మరెక్క కృష్ణవేణి(38) జూన్ 6న వ్యవసాయ పొలంలో పనిచేసుకుంటుండగా పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె వెంట ఉన్న భర్త కృష్ణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ కుటుంబానికి మొత్తం 20 గుంటల భూమి మాత్రమే ఉండగా, కృష్ణయ్య జీవనోపాధి కోసం ఆటో నడుపుకుంటున్నాడు. పిడుగు ప్రభావంతో అనారోగ్యానికి గురై ఇంటివద్దే ఉంటున్నాడు. కుమారుడు సాయికిరణ్ బీటెక్ చదువుతుండగా, కుమార్తె మానస బీఫార్మసీ చదువుకుంటోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థికసాయం అందలేదని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

బడుగులపై.. పిడుగుపాటు!

- ఉమ్మడి జిల్లాలో తరుచుగా ఘటనలు
- ప్రాణాలు కోల్పోతున్న రైతులు, కూలీలు, కాపరులు
- రెండేళ్లుగా బాధిత కుటుంబాలకు అందని పరిహారం
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న వైనం
- పశువుల కోసం, పొలం పనులకు వెళ్లి మరణిస్తున్న వారే అధికం



సాక్షి, నాగర్‌కర్నూల్: వర్షం వచ్చిందంటే చాలు.. ఉరుములు, మెరుపులతో ఎక్కడో ఒక చోట పిడుగు పడుతుంది. ఆరుగాలం కష్టించి పనిచేసి తమ కుటుంబాలను పోషించుకుంటున్న రైతుల బతుకుల్లో ఈ పిడుగుపాటు ఘటనలు వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పిడుగుపాటుకు గురై ఎంతోమంది రైతులు, కూలీలు, కాపరులు అకాల మరణం చెందుతున్నారు. ఇంటి పెద్దను కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రెండేళ్లుగా పిడుగుపాటు మరణాలకు ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియా సక్రమంగా అందటం లేదు.

ఏటా పదుల సంఖ్యలో మరణాలు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏటా పదుల సంఖ్యలో పిడుగుపాటు మరణాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షం, ఈదురుగాలులతో పాటు ఒక్కసారిగా పిడుగుపడి వ్యక్తులను బలి తీసుకుంటున్నాయి. ఇటీవల రెండు రోజుల వ్యవధిలోనే నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం రాంరెడ్డిపల్లిలో రైతు రాములుతో పాటు బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లిలో పశువులు కాసేందుకు వెళ్లిన మహిళ నీలమ్మ, వనపర్తి జిల్లా చిమనగుంటపల్లికి పద్మమ్మ గొర్రెలను మేతకు తీసుకెళ్లి పిడుగుపడి మరణించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడేళ్ల వ్యవధిలో 158 మంది పిడుగుపాటుకు మరణించారు. వర్షాకాలంలో పశువుల మేతకు, పొలం పనులకు వెళ్లే కూలీలే వీరిలో ఎక్కువగా ఉన్నారు.

పరిహారం అందడంలో జాప్యం..

పిడుగుపాటు మరణించిన వారి కుటుంబాలకు గతంలో ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించేది. 2015లో ఈ మొత్తాన్ని రూ.6 లక్షలకు పెంచింది. అయితే బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించడంలో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపి ఏడాది గడిచినా బాధితులకు సకాలంలో ఎక్స్‌గ్రేషియా అందడం లేదు. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన పరిహారం అందజేయాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు



మా నాన్న ఆశన్న జూన్ 7న మధ్యాహ్నం పొలంలో విత్తనాల సాగు చేస్తున్న సమయంలో ఉరుములతో కూడిన వర్షానికి పిడుగుపాటు గురై మృతి చెందారు. మా నాన్నతో పాటు మా చిన్నమ్మ కౌసల్య పిడుగు పాటుతో చనిపోయింది. అధికారులు ఇంటి దగ్గరికి వచ్చి పంచనామా నిర్వహించి రిపోర్టు రాసుకున్నారు. కానీ ఇప్పటి వరకు మాకు మా చిన్నమ్మ కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు. మా అమ్మ, అన్న, మేమందరం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం.

– భీమప్ప, విఠల్‌పూర్, దామరగిద్ద మండలం

మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న నా భర్త మరణంతో మా కుటుంబం ఇబ్బందుల్లో పడింది. నాకు కుమారుడు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబపోషణకు నేను మేకలను కాస్తున్నాను. మా కుటుంబానికి రైతు బీమా తప్ప ఏ రకమైనా ఆర్థిక సహాయం అందలేదు. ఆర్థిక పరిస్థితి సరిగ్గాలేక పోవడంతో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నాను. ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– తల్లి జమునాబాయితో ముగ్గురు కూతుళ్లు, పెద్దవార్వాల్, గండేడ్ మండలం

ప్రభుత్వానికి నివేదిక అందించాం..

పిడుగుపాటుకు మరణించిన వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్ ద్వారా నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందాల్సి ఉంది. పిడుగుపాటుతో మరణించిన కుటుంబానికి రూ.6 లక్షల మేరకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. – సురేశ్, ఆర్డీఓ, నాగర్‌కర్నూల్

'ప్రజావాణి'ని పకడ్బందీగా చేపట్టాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలన్న ఉద్దేశంతో వచ్చే సోమవారం నుంచి మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడుతూ మండల స్థాయిలోనే ఫిర్యాదులు పరిష్కరించడం వల్ల బాధితులకు వెంటనే ప్రయోజనం కలుగుతుందని, అందువల్ల మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయిలో మాదిరిగానే ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించాలని, మండల స్థాయిలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సైతం హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే అన్ని రకాల దరఖాస్తులను స్వీకరించాలని, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి.. వీలైనంత వరకు తక్షణమే పరిష్కరించేలా చూడాలన్నారు. పరిష్కారం కానివి స్పష్టంగా ఫిర్యాదుదారుకు చెప్పాలని, జిల్లాస్థాయిలో పరిష్కారం అయ్యేవాటిని తమకు పంపించాలని చెప్పారు. మండల స్థాయిలో ఫిర్యాదులు అందించినా పరిష్కారం కాకపోతే.. 15 రోజుల తర్వాత జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రజావాణికి రావాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు సైతం దీనిపై దృష్టిసారించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల పరిష్కారం నిమిత్తం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి వచ్చే దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. ప్రతినెలా 1న గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషికాహార దినోత్సవం నిర్వహించాలని, ఈ కార్యక్రమానికి గ్రామస్థాయి సిబ్బంది మొదలుకొని అందరూ హాజరుకావాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని, మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్ పెంచాలని, బ్యాంకుల అనుసంధానంతో అమలు చేసే యూనిట్ల గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సోమవారం ప్రజావాణికి 72 ఫిర్యాదులు వచ్చాయి.

మానసిక వ్యక్తులకు టెలి మానస్

వివిధ రకాల మానసిక ఒత్తిడికి గురైన వారికి ఉచిత కౌన్సెలింగ్ ఇచ్చేందుకు రాష్ట్ర కుటుంబ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టెలిమానస్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ విజయేందిర చెప్పారు. టెలి మానస్‌పై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆమె విడుదల చేసి మాట్లాడారు. మానసిక ఒత్తిడిలో ఉన్నవారు, పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులు, తాగుడు మానలేక ఒత్తిడితో ఇబ్బంది పడుతున్న వారు, ఇతర మానసిక సమస్యలతో బాధపడేవారు ఉచిత కౌన్సెలింగ్ కోసం టెలి మానస్ టోల్ ఫ్రీ నం .14416 ద్వారా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎంహెచ్ఓ పద్మజ, ప్రోగ్రాం అధికారి భాస్కర్‌నాయక్, ఆర్డీఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వాలని డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: క్రిష్టియన్‌పల్లి రెవెన్యూ శివారు 523 సర్వేనంబర్‌లో పట్టా సర్టిఫికెట్లు అప్పగించిన వారికి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని కోరుతూ జీపీజేఏసీ, టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ ఘన్సీరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టీపీజేఏసీ జిల్లా కోకన్వీనర్ పి.యాదగిరి, జి.గట్టన్న, టీఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, పట్టణ కార్యదర్శి జలాల్ పాష మాట్లాడారు. 523 సర్వేనంబర్‌లో ఇంటి పట్టా సర్టిఫికెట్ కలిగిన వారి నుంచి 2018 సంవత్సరంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయ అధికారులు పట్టాలు స్వాధీనం చేసుకొని విచారణ చేసి డబుల్ ఇల్లు ఇస్తామని అన్నారని చెప్పారు. అధికారుల మాటను నమ్మి పట్టా సర్టిఫికెట్లను కార్యాలయంలో సమర్పించారని పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ అధికారులు విచారణ జరిపి 887 మంది డబుల్ ఇల్లు పొందుటకు అర్హులుగా నిర్ధారిస్తూ అప్పటి కలెక్టర్ రొనాల్డ్ రోస్ జాబితాను రూపొందించారని తెలిపారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికైనా పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

29న లంబాడీల మహాగర్జన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో ఈ నెల 29న లంబాడీల మహాగర్జన.. నంగారా భేరి నిర్వహించనున్నట్టు ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రామునాయక్ చెప్పారు. సోమవారం స్థానిక మెట్టుగడ్డలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న అంబేద్కర్ చౌరస్తా నుంచి బీఆర్ అంబేద్కర్ కళాభవన్ వరకు భారీ ర్యాలీ చేపడతామన్నారు. దీనికి ముఖ్య అతిథిగా తెలంగాణ ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య హాజరవుతారన్నారు. నంగారా భేరిలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తమ భాష 'గోర్‌బోలీ'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లోని గిరిజనులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజునాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు యాదగిరినాయక్, కోశాధికారి డాక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛత హీ సేవ'



జీజీహెచ్‌కు ఎదుట చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం జడ్చర్ల–రాయచూర్ జాతీయ రహదారి–167కి ఇరువైపులా మెట్టుగడ్డ నుంచి జీజీహెచ్ వరకు చెత్తతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్థానికులతో కలిసి సేకరించారు. అనంతరం వాటిని కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'మార్షల్ ఆర్ట్స్'

- మూడునెలలపాటు బాలికలకు ప్రత్యేక శిక్షణ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 711 స్కూళ్ల ఎంపిక
- కొన్నిచోట్ల ఇప్పటికే ప్రారంభమైన తర్ఫీదు
- ఆసక్తికనబరుస్తున్న విద్యార్థినులు



మహబూబ్‌నగర్‌లోని మహాత్మగాంధీ రోడ్డు స్కూల్‌లో కరాటే శిక్షణ తీసుకుంటున్న బాలికలు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశిక్షణ్' (సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం) కింద గతంలో మాదిరిగా ఈ ఏడాది కూడా కరాటే శిక్షణ ఇవ్వనున్నారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం నింపేలా గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వం మార్షల్ ఆర్ట్స్ శిక్షణకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 5,748 ప్రభుత్వ పాఠశాలలు శిక్షణకు ఎంపిక చేయగా.. ఉమ్మడి జిల్లాలో 574 ఉన్నత, ప్రాథమికోన్నత, 137 ప్రాథమిక పాఠశాలలను శిక్షణకు ఎంపిక చేశారు.

బోధనకు ఆటంకం కలగకుండా..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, కేజీబీవీలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లలో బాలికలకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నారు. వారంలో మూడు, నెలలో 12 సార్లు ప్రత్యేక కరాటే శిక్షణ ఇవ్వాలి. ఇందుకోసం బోధనకు ఆటంకం కలగకుండా అనువైన సమయం కేటాయించాలి. మార్షల్ ఆర్ట్స్ నేరిస్తున్న శిక్షకులకు నెలకు రూ.5 వేల చొప్పున, మూడు నెలలకు రూ.15 వేలు అందజేయనున్నారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఉత్సాహభరితమైన వాతావరణంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కొనసాగుతోంది. ఒక్కో పాఠశాలలో వారంలో మూడు శిక్షణ తరగతులు నిర్వహిస్తుండటంతో.. బాలికలు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎంపికైన పాఠశాలలు ఇలా..

జిల్లా	ఉన్నత, ప్రాథమికోన్నత	ప్రాథమిక పాఠశాలలు
మహబూబ్‌నగర్	140	30
నాగర్‌కర్నూల్	151	15
వనపర్తి	111	7
గద్వాల జోగుళాంబ	94	39
నారాయణపేట	78	46

మెరుగైన శిక్షణ..



ప్రభుత్వ పాఠశాలల బాలికలకు మెరుగైన కరాటే శిక్షణ ఇస్తున్నాం. మా కరాటే క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 9 ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇవ్వనున్నాం. ఈ మూడు నెలల్లో బాలికలకు కరాటేలో అవసరమైన మెళకువలు నేర్పిస్తాం. కరాటే, కిక్‌బాక్సింగ్ తదితర సెల్ఫ్ డిఫెన్స్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తాం. – జహంగీర్‌పాషా, కరాటే మాస్టర్, మహబూబ్‌నగర్

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



ప్రస్తుత సమాజంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఎంతో అవసరం. ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ శిక్షణ చాలా అవసరం. మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మూడేళ్ల నుంచి నేను ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్న. – నవీన్‌కుమార్, కరాటే మాస్టర్, మహబూబ్‌నగర్

రెగ్యులర్‌గా నియమించాలి..



మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని పలు పాఠశాలల్లో ఐదేళ్ల నుంచి కరాటే శిక్షణ ఇస్తున్న. కరాటేతోపాటు ప్రత్యేక యోగా కూడా నేర్పిస్తున్నా. కేవలం మూడు నెలలపాటు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్‌గా కరాటే మాస్టర్‌ను నియమిస్తే బాలికలకు ఇంకా మెరుగైన శిక్షణ లభిస్తుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – కె.వెంకటేశ్, కరాటే మాస్టర్, మహబూబ్‌నగర్



ఒకే రోజు 41 ప్రసవాలు



ఉమ్మడి పాలమూరుకు పెద్ద దిక్కుగా మారిన జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 20న 24 గంటల్లో 41 కాన్పులు అయ్యాయి. ఇందులో 30 మందికి ఆపరేషన్ కాగా.. 11మంది సాధారణ ప్రసవం జరిగింది. గతంలో ఒకేరోజు 44 మంది ప్రసవించగా.. ఈసారి 41కి చేరింది. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ జనరల్ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం గైనిక్ విభాగం వైద్య బృందాన్ని అభినందించారు. – పాలమూరు

క్లుప్తంగా

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

గోపాల్‌పేట: డబ్బుల కోసం భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాల్‌పేట మండలం జయన్న తిర్మలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. జయన్న తిర్మలాపూర్‌కు చెందిన వాల్డాస్ నాగేంద్ర గౌడ్ కుమారుడు మహేష్‌గౌడ్ (36) డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఆదివారం మద్యం తాగేందుకు తన భార్య నాగలక్ష్మిని డబ్బులు అడుగగా ఇవ్వలేదు. ఈ క్రమంలో భార్యతో గొడవ పెట్టుకొని బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో అతడి సోదరుడు నరేష్‌గౌడ్ నాగలక్ష్మికి ఫోన్‌చేసి, మహేష్‌గౌడ్ గ్రామ సమీపంలోని చెరువులో దూకాడని సమాచారం ఇచ్చారు. గ్రామస్తులతో కలిసి కుటుంబ సభ్యులు చెరువులో వెతకగా.. ఆచూకీ లభించలేదు. సోమవారం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మహేష్‌గౌడ్ మృతదేహాన్ని గుర్తించి, చెరువులో నుంచి బయటికి తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ రహదారిపై సోమవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన ఎంఏ బషీర్, శ్రీనివాసులు స్కూటీపై శ్రీశైలం వెళ్తూ.. మార్గమధ్యంలో మన్ననూర్ వద్ద మద్యం తాగారు. ఇక్కడి నుంచి మద్యం మత్తులో స్కూటీపై వెళ్తుండగా.. ఫర్హాబాద్ సమీపంలో కోతులను తప్పించబోయి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మిడ్జిల్: రాణిపేట్ గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కల్వర్టును మరో బైక్ ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రాణిపేట్‌కు చెందిన జగన్‌కు, చిల్వేర్‌కు చెందిన సంబ మల్లేష్ తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మద్యం కాటన్ల చోరీ

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజీపేట మండల కేంద్రంలోని ఐఎంఎఫ్‌ఎల్ డీపో ఎదుట పార్కింగ్‌లో ఉన్న లారీ నుంచి 16 కాటన్ల మద్యం చోరీకి గురైంది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మద్యం కాటన్ల లారీ ఐఎంఎఫ్ఐఎల్ డీపో ఎదుట నిలిపారు. లారీలో రూ.1.15 లక్షల మద్యం కాటన్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో లారీ డ్రైవర్ తిమ్మాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జంటల ఫొటోలు తీసి.. కానిస్టేబుల్ బెదిరింపులు

నాగర్‌కర్నూల్ క్రైం: ఒంటరిగా ఉన్న జంటను ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీస్ కానిస్టేబుల్‌పై సోమవారం ఆరోపణలు వినిపించాయి. వివరాలిలా జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులోని ప్రధాన రహదారిపై కారును ఆపి ఓ వ్యక్తి మహిళతో మాట్లాడుతుండగా జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ వారిని ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడ్డాడు. డబ్బులు ఇవ్వాలని కానిస్టేబుల్ డిమాండ్ చేయడంతో చేసేదేమీ లేక రూ.2000 వేలు ఫోన్ పే ద్వారా కానిస్టేబుల్ స్నేహితుడి అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు సదరు కానిస్టేబుల్‌పై విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఘటనపై నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య గౌడ్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

విధుల నుంచి ఇద్దరి తొలగింపు

నాగర్‌కర్నూల్ క్రైం: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న వీధికుక్కలు ఆస్పత్రిలో సంచరిస్తూ రోగులు ఇబ్బందులు పడుతున్నా శానిటేషన్ సిబ్బంది శేఖర్, ఆయా సంతోషమ్మలు నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. దీంతో వారిని విధుల నుంచి తొలగించామని మేల్‌నర్సింగ్ ఆఫీసర్ మహేష్‌కు మెమో జారీ చేశామని తెలిపారు.

పర్యాటకం.. పరిహాసం!



జోగులాంబ ఆలయం

జిల్లావ్యాప్తంగా ప్రసిద్ధ ఆలయాలు, కృష్ణానది తీర ప్రాంతాలు, కొండలు

- పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే ఎంతో మేలు
- అటువైపు కన్నెత్తి చూడని ప్రభుత్వ పెద్దలు, అధికారులు
- తూతూ మంత్రంగా సంగాల పర్యాటక కేంద్రం



గట్లు, సువిశాలమైన స్థలంలో వెలసిన తనగల గట్టు తిమ్మప్పస్వామి వారి ఆలయ పరిసరాలు

శాంతినగర్: అలంపూర్ జోగుళాంబ, బీచుపల్లి క్షేత్రాలు.. కృష్ణానది తీరం.. జూరాల ప్రాజెక్టు.. నలసోమనాద్రి కోట.. ఇలా జిల్లాలో ఎన్నో ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు వీలున్నా ప్రభుత్వ పెద్దలు, అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో జిల్లాలో పర్యాటకం పరిహాసంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యాటక కేంద్రాలను గుర్తించి ఎంతో అభివృద్ధి చేశారు.. చేస్తున్నారు. కానీ, జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో ఆ దిశగా పర్యాటకం అభివృద్ధి చెందడంలేదు. దీంతో అటు పర్యాటకుల కోలాహలం లేక ఇటు ఆర్థికంగా అభివృద్ధి చెందక నడిగడ్డ ప్రాంతం వెనకబడిపోతోందని విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గద్వాలలో నలసోమనాద్రి కోట ఉన్నప్పటికీ కోటను అభివృద్ధి చేయలేదు. జూరాల వద్ద పూర్తి స్థాయిలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్నా మమ అన్నట్లుగా పార్కులు ఏర్పాటుచేశారు. మరికొన్ని పనులు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక అలంపూర్ నియోజకవర్గంలో అసలు పర్యాటక కేంద్రాలే లేవని చెప్పవచ్చు. జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామివారి ఆలయాలు, కృష్ణానది తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా అందుకు నోచుకోవడం లేదు.

అనుకూలమైన ప్రాంతాలు..

జిల్లాలోని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు అనుకూలమైన ప్రకృతి వనరులు, నదులు, గుట్టలు, కోటలు, దేవతామూర్తుల ఆలయాలు వున్నాయి. ఈమేరకు గద్వాలలోని సోమనాద్రి కోట, జూరాల ప్రాజెక్ట్, సంగాల రిజర్వాయర్, చింతరేవుల ఆంజనేయస్వామి వారి ఆలయం, గద్వాల సమీపంలోని అగ్రహారం, పాగుంట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాలు ఉన్నాయి. అలాగే బిజ్వారం సమీపంలోని కొచ్చగట్టు ప్రాంతం, మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, అయిజ సమీపంలోని కట్టక్రింద తిమ్మప్ప స్వామి వారి ఆలయ సమీపంలోని చెరువు ఇంకా ఎన్నో ప్రదేశాలను అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఎంతో మందిని ఆకర్షించనుంది.

సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది..



జిల్లా పరిధిలో ఎన్నో పుణ్య క్షేత్రాలు, గట్లతో పాటు తుంగభద్ర, కృష్ణా నదులు పారుతున్నా వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయకపోవడం, ఆ దిశగా అధికారులు చూడకపోవడం దురదృష్టకరం. సొంత జిల్లాలో పర్యాటక కేంద్రాలు లేకపోవడంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని సుందరమైన ప్రదేశాలకు విహార యాత్రలకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఇతర రాష్ట్రాలు అటు పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయి.

– కోట్ల గోపాల్‌రెడ్డి, వచ్చర్ల, రాజోళి మండలం

తనగల గట్టును అభివృద్ధి చేయాలి..



జిల్లాలోని తనగల గట్టును పర్యాటక కేంద్రంగా ఏర్పాటుచేయాలి. 125 ఎకరాల విశాలమైన ప్రభుత్వ స్థలం, చుట్టూ ఎత్తయిన గట్టు, వృక్షాలు, సమీపంలో ఆర్డీఎస్ కెనాల్, మల్లమ్మ కుంట పరిసర ప్రాంతాలు వున్నాయి. దీనిని పర్యాటక కేంద్రంగా మార్చితే బాగుంటుంది.

– లక్ష్మన్న, కిష్టాపురం, అయిజ మండలం

బోటింగ్‌కు అనుకూలం..



త్వరలో మల్లమ్మకుంటలో 1.02 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నారు. తనగల గట్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే పర్యాటకులకు బోటింగ్ సౌకర్యం కల్పించేందుకు అనువుగా వుంటుంది. అంతేగాక ప్రభుత్వ స్థలం చాలా వుంది. అభివృద్ధి చేయవచ్చు.

– నరేష్, కిష్టాపురం, అయిజ మండలం

అలంపూర్ నియోజకవర్గంలో..

అలంపూర్ నియోజకవర్గంలోని జోగుళాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణం, సంగమేశ్వరం, తనగల గట్టు తిమ్మప్ప ఆలయం చుట్టూ వున్న 125 ఎకరాల ప్రభుత్వ స్థలం, వడ్డేపల్లి వసంతమాధవస్వామి వారి గట్టు, 100 ఎకరాల సువిశాలమైన ప్రకృతి, రాజోళిలో తుంగభద్రనది సమీపంలో వెలసిన లక్ష్మీ వైకుంఠనారాయణస్వామి వారి పురాతన ఆలయం, కోట, తుంగభద్ర నది మధ్యలో వెలసిన శివాలయ ప్రాంతాలు ఉన్నాయి. వీటితోపాటు తుంగభద్ర నది సమీపంలోని వేణిసోంపురం వేణుగోపాలస్వామి వారి ఆలయం, బీచుపల్లి సమీపంలో కృష్ణానది ఒడ్డున వెలసిన కోదండరామస్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయం, పుల్లూరు సమీపంలో తుంగభద్రనది ఒడ్డున వున్న విశాలమైన ప్రదేశాలు పర్యాటక కేంద్రాలకు అనుకూలంగా ఉన్నాయి. జిల్లా పరిధిలో ప్రభుత్వ స్థలాలు, పుణ్య క్షేత్రాలు, ప్రకృతి వనరులు వున్నప్పటికీ పర్యాటక కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడం దురదృష్టకరమని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల కొరత.. పాఠశాల గేటుకు తాళం



ఆరగిద్దలో పాఠశాల గేటుకు తాళం వేసి ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గట్టు: ఉపాధ్యాయుల కొరతకు నిరసనగా సోమవారం ఆరగిద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేటుకు తాళం వేసి ఆందోళన నిర్వహించారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలో మొత్తం 306 మంది విద్యార్థులు చదువుకుంటుండగా కేవలం ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు పని చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో నలుగురు ఉపాధ్యాయులు ఇక్కడి నుంచి వెళ్లారని, బదిలీల తర్వాత ఇక్కడికి ఎవరు రాకపోవడంతో విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా మారాయని వాపోయారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల కొరత తీరకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన బాట పట్టారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషతో పాటుగా విద్యార్థి సంఘం నాయకులు వారికి మద్దతు పలికారు. విషయం ఎంఈఓ నర్సింహులు దృష్టికి వెళ్లడంతో.. దసరా సెలవుల తర్వాత విద్యా వలంటీర్ల ఏర్పాటుకు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ప్రాసెసింగ్ యూనిట్లతో రైతులకు మేలు



మాట్లాడుతున్న డెవలప్‌మెంట్ అధికారి ఎస్‌కే శర్మ

నవాబ్‌పేట: రైతులకు మేలు చేసేందుకే గ్రామీణ స్థాయిలో ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పినట్లు న్యూఢిల్లీ స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ క్లస్టర్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్‌కే శర్మ అన్నారు. సోమవారం మండలంలోని పోమాల్‌లో పాలమూరు రైతు డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీతాఫల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన జిల్లా అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాలు, చెరువు గట్లపైన, తాము నివాసం ఉండే ఆవాసాల చెంత లభించే వాటితో ప్రత్యేక ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని, అందుకే దీన్ని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. రైతులకు అన్ని రకాల ఉపాధి చూపడంతోపాటు వారి ఉత్పత్తులకు ప్రత్యేక డిమాండ్ వచ్చేలా చేసి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందేలా ఈ కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు. రైతు డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా ఇప్పటికే పంటలకు కావాల్సిన ఎరువులు అందిస్తున్నారని, అలాగే కొత్తగా సీతాఫల్ యూనిట్ ఏర్పాటు చేశారన్నారు. దీంతోపాటు సీజనల్ పంటలకు సైతం ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై సైతం పరిశీలనలు జరుపుతున్నట్లు వివరించారు. అలాగే సీతాఫలాలను అటవీ శాఖ పరిధిలో నుంచి తొలగించి రైతులకు స్వేచ్ఛ ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రంగారావు, రాజిరెడ్డి, రాంరెడ్డి, గజేందర్, రామ్మోహన్‌రెడ్డి, రాములు, జయసింహారెడ్డి, రఘునందన్‌రెడ్డి, హరికృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలమర్రి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పిల్లలమర్రి పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో పిల్లలమర్రి పర్యాటక కేంద్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై పర్యాటక, అటవీ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలమర్రి చెట్టును ప్రారంభించిన తర్వాత పర్యాటకుల సంఖ్య పెరిగిందని, భవిష్యత్‌లో ఇంకా పెద్దమొత్తంలో వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. పిల్లలమర్రి చెట్టు వద్ద ల్యాండ్ స్కేపింగ్, క్యాంటీన్ పునర్నిర్మాణం, ఆర్చి ఏర్పాటు, సైన్స్ మ్యూజియం, అక్వేరియం, పిల్లల పార్క్ వంటివి అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని సూచించారు. అలాగే చెక్‌డ్యాంలో తిరిగి బోటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సత్యనారాయణ, జిల్లా మత్స్య శాఖ అధికారి రాధారోహిణి, ఆర్కిలాజికల్, హెరిటేజ్ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, పర్యాటకశాఖ డిప్యూటీ ఇంజినీర్ పరుషవేది, ఏఎంఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

నారాయణపేట: విద్యుత్ సమస్యలు, అంతరాయాల పరిష్కారానికి టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫారుఖీ ఆదేశాల మేరకు సోమవారం నారాయణపేట సర్కిల్ కార్యాలయంలో నూతన కంట్రోల్‌రూంను ఎస్ఈ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యుత్ అంతరాయాలు, లో ఓల్టేజీ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, ఏ ఇతర సమస్యలు ఎదురైనా వినియోగదారులు కంట్రోల్ రూం మొబైల్ నంబర్ 8985447537కు 24 నాలుగు గంటలు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆపరేషన్ బీఎల్ నర్సింహరావు, డీఈ టీసీహెచ్ నందకిషోర్, డీఈ ఎంపి టి. శ్రీనివాస్, ఏడీలు, ఏఈలు, అకౌంట్ సిబ్బంది పాల్గొన్నారు.



కంట్రోల్‌రూంను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రభాకర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖిల్లాఘనపురం: దొంతికుంట తండాకు చెందిన కొడావత్ తోధ్య చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. తండా సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న తోధ్య.. ఈ నెల 19న విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా, అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెల్‌నెస్ ఆస్పత్రి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తోధ్య కుమారుడు కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

బీఎస్ఎన్ఎల్ స్టోర్‌లో చోరీ



వైర్లు కత్తిరించడానికి ఉపయోగించిన కట్టర్లు

భూత్పూర్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని స్టోర్ కంపౌండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం మధ్యరాత్రి కాపర్‌వైర్లను అపహరించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది కథనం మేరకు.. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని స్టోర్ కంపౌండ్‌లో జిల్లాకు సంబంధించిన వైర్లు, టెలిఫోన్ స్తంభాలు, నిచ్చెనలు, తదితర వస్తువులు ఉంచారు. ప్రతిరోజు నైట్‌వాచ్‌మెన్ విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి దాదాపు 1.40 గంటల సమయంలో చిన్నపాటి శబ్ధాలు రావడంతో నైట్‌వాచ్‌మెన్ షాన్‌పాష కంపౌండ్ ఆవరణలోని ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు వైర్లు కత్తరిస్తున్నటు గమనించాడు. వెంటనే స్థానిక పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. పోలీసుల వాహనం రావడాన్ని గమనించిన దుండగులు కారులో పరారయ్యారు. కారును పోలీసులు వెంబడించడంతో జాతీయ రహదారిపై వేగంగా తప్పించుకొని వెళ్లిపోయారు. సంఘటన స్థలంలో రెండు కట్టర్లు, ఓ స్వెటర్‌ను వదిలివెళ్లారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్టోర్ కంపౌండ్‌ను పరిశీలించారు. 200 మీటర్ల దాదాపు రూ.90వేల విలువైన వైరును అపహరించకపోయినట్లు గుర్తించారు. బీఎస్ఎన్ఎల్ జూనియర్ టెలికాం ఆఫీసర్, స్టోర్ ఇన్‌చార్జి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.



భూత్పూర్ బీఎస్ఎన్ఎల్ స్టోర్ కంపౌండ్‌లో అపహరించకుపోగా, మిగిలిన వైర్లు

పేదల అవసరాలు తీరుస్తాం

గోపాల్‌పేట: పేదల అవసరాలు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి అన్నారు. సోమవారం తన స్వగ్రామమైన మండలంలోని జయన్న తిర్మలాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పనులు పూర్తయిన వాటిని ప్రారంభించారు. గ్రామంలో రూ.20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి తన కమారుడు, ఏఐసీసీ కో–ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి స్థలాన్ని ఇవ్వగా ఆయన పనులకు శంకుస్థాపన చేశారు. ఆస్పత్రి ప్రారంభమైతే గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు సైతం మేలు చేకూరుతుందని వివరించారు. అనంతరం రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.ఐదు లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను, ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.29 లక్షలతో నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని, గ్రామాల్లోని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్ ఇస్తోందని తెలిపారు. గ్రామంలో 200 మందికి రాయితీ గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధానకార్యదర్శి జిల్లెల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, లోకేష్‌రెడ్డి, బొజ్జ యాదవ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

మృతదేహం నుంచి బంగారు గాజు మాయం?



సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: మృతదేహం చేతికి ఉన్న బంగారం గాజు మాయం చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈనెల 14న యశోద జిల్లా జనరల్ ఆస్పత్రిలో మృతి చెందింది. ఈ క్రమంలో మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి ఇంటికి తరలించేందుకు అంబులెన్స్‌లోకి ఎక్కించే క్రమంలో రెండు చేతులకు ఉన్న నాలుగు బంగారు గాజులలో ఒక గాజును ఎవరో దొగలించారు. అపహరణకు గురైన బంగారం గాజు రెండు తులాలు ఉంటుంది. వార్డు బాయ్ తీశాడని బాధితులు ఆరోపిస్తుండగా, వార్డు బాయ్ తాను తీయలేదని చెబుతున్నాడు. దీనిపై టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం టూటౌన్ కానిస్టేబుల్స్ ఆస్పత్రిని సూపరింటెండెంట్ గదిలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. దీనిలో ఎలాంటి స్పష్టత లేకపోవడంతో విచారణ కొనసాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో.. తల్లీకూతుళ్ల దుర్మరణం

- భర్త, కుమారుడికి స్వల్పగాయాలు
- ముందు వెళ్తున్న వాహనాన్ని దాటబోయి ఢీకొట్టిన ద్విచక్రవాహనం
- శ్రీరంగాపురం శివారులో దుర్ఘటన



స్వాతి (ఫైల్)



అశ్విత (ఫైల్)

వనపర్తి రూరల్: చిన్నపాటి నిర్లక్ష్యం భర్తకు భార్యను, కుమారుడికి తల్లిని దూరం చేసింది. ముందు వెళ్తున్న వాహనాన్ని దాటబోగా.. అదుపు తప్పి ద్విచక్రవాహనం ఢీకొనడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లు అక్కడికక్కడే దుర్మరణం పాలవగా.. తండ్రీకొడుకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. శ్రీరంగాపురం మండలం నాగరాల గ్రామం ఫస్ట్ సెంటర్‌కు చెందిన గంధం బక్కలయ్య అలియాస్ పులేందర్, భార్య స్వాతి, కూతురు అశ్విత, కుమారుడు బన్నీతో కలిసి సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై శ్రీరంగాపురం ఆస్పత్రికి వెళ్తున్నారు. ఈ క్రమంలో శ్రీరంగాపురం శివారులో పృథ్వీరాజు తోట దగ్గర ముందు మిల్లర్‌తో వెళ్తున్న మినీ డీసీఎంను బైక్ క్రాస్ చేస్తూ అదుపు తప్పి ఢీకొనడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో స్వాతి(26), అశ్విత(3)పై మిల్లర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పులేందర్, బన్నీకి స్వల్ప గాయాలు కావడంతో పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పులేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని కొత్తకోట సీఐ రాంబాబు పరిశీలించారు. గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే బాధిత కుటుంబాన్ని న్యాయం చేయాలని ఘటనా స్థలంలో బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. పోలీసులు కల్పించుకొని ధర్నాను విరమింపజేసి మృతదేహాలను వనపర్తి ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లు స్వాతి, అశ్విత మృతిచెందగా.. తండ్రి పులేందర్, కుమారుడు బన్నీ అనాథగా మారారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

పనుల పరిశీలన

జడ్చర్ల టౌన్: రైల్వేస్టేషన్ వద్ద కొనసాగుతున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.రాజయ్య పరిశీలించారు. గాంధీచౌరస్తా వద్ద వేస్తున్న సీసీరోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా హనుమాన్ దేవాలయ కమాన్ వైపు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్, నర్సింహ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

జడ్చర్ల: మండల తహసీల్దార్‌గా బ్రహ్మంగౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మూసాపేట నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ రెడ్డిని సీసీఎల్‌ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ సస్పెండ్ చేసిన విషయం విదితమే.

దేవరకద్ర: మండల తహసీల్దార్ శ్రీనివాస్ నవాబ్‌పేటకు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం ఎంపీడీఓ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ దీపిక, కాంగ్రెస్ మండల నాయకులు కోన రాజశేఖర్, రాజుగౌడ్ తదితరులు ఆయనను సన్మానించారు.

ఎన్‌పీ వెంకటేష్‌కు సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్‌పీ.వెంకటేశ్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సాయిబాబా, బండ సునీల్, ఫక్రు ఖురేషి, ఫహీం, ముజిబ్, అంతయ్య పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డిని జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో.. పోల్కంపల్లి యువత సన్మానించారు. ప్రతాప్ రెడ్డి, ఆకుల శ్రీకాంత్, కేశవులు, పల్లిమల్లేష్, బోలశ్రీశైలం, సూరి, తిరుపతిరెడ్డి, భగవంత్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

భూత్పూర్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, అధ్యక్షుడిగా లిక్కి విజయ్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా గౌడుగు వెంకట్‌రాజు, జైదు శ్రీను, గడ్డం యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా గడ్డం ఎల్లప్ప, సంస్కృతిక కార్యదర్శులుగా బోరింగ్ నర్సింహులు, కృష్ణయ్య గౌడ్, సాయిలు ఎన్నికయ్యారు.

పరామర్శ..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న జైనల్లిపూర్ మాజీ సర్పంచ్ విజయశాంతిని సోమవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలని ధర్నా



మక్తల్: పట్టణంలో తాగునీటి ఎద్దడిని నివారించాలని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కాలనీవాసులు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. మిషన్ భగీరథ నీళ్లు కొన్ని రోజులుగా రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనికి తోడు వచ్చిన కొంత నీటి సరఫరా కూడా సమయపాలన లేకుండా విడుదల చేస్తారని మండిపడ్డారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

భూనీడ్‌లో పౌష్టికాహార వారోత్సవాలు

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని భూనీడ్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా భూనీడ్ సెక్టర్ పరిధిలోని గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు.

కష్టాల కళాశాల..



పాఠశాల పాతభవనంలో మహమ్మదాబాద్ జూనియర్ కళాశాల

- సిబ్బంది కరువు.. వసతులు లేవు
- విద్యార్థులకు తప్పని అవస్థలు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. ఓ వైపు సిబ్బంది లేకపోవడం, మరోవైపు సౌకర్యాలు కరువవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్యకు తగిన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం మహమ్మదాబాద్ మండల కేంద్రంలో ఓ ఇంటర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. కానీ కళాశాలకు తగిన గదులు, బోధన సిబ్బంది, ఇతర సౌకర్యాలు కల్పించలేదు. కాగా ఇక్కడ ఇంటర్ మొదటి సంవత్సరంలో 102 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరారు. వారిలో దాదాపు 90 మంది విద్యార్థులు కళాశాలకు రెగ్యులర్‌గా వస్తుంటారు. అయితే కళాశాల నిర్వహణకు ఎక్కడా భవనం స్థలం లేకపోవడంతో గ్రామస్తులంతా కలిసి ఉన్నత పాఠశాల పాతభవనాన్ని చూయించారు. అయితే అంతకుముందే ఆ భవనాన్ని తహసీల్దార్, వ్యవసాయాధికారి భవనాలకు కేటాయించారు. మళ్లీ వారిని సర్దుబాటు చేసి ప్రస్తుతానికి చాలీచాలని నాలుగు గదుల్లో కళాశాలను కొనసాగిస్తున్నారు. దీనికి తోడు కళాశాలలో ఒక్క ప్రిన్సిపల్ తప్పా బోధన సిబ్బంది అంతా ప్రభుత్వేతరులే. పాఠశాలకు ఉన్న నిధులను ఖర్చుచేసి ప్రైవేట్‌గా 9 మంది బోధనా సిబ్బందిని నియమించుకుని కాలం వెళ్లదీస్తున్నారు. అదేవిధంగా ఇక్కడ టాయిలెట్స్, బాత్‌రూం, క్రీడారూం, ఫర్నీచర్, లైబ్రరీ, ల్యాబ్ గదులు ఇలా చెప్పుకుంటూ పోతే దాదాపు ఏ సౌకర్యం లేక విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.



గదులు లేక పాఠశాల డైనింగ్‌హాల్లో అందరికీ ఒకే దగ్గర బోధిస్తున్న సిబ్బంది

సిబ్బందిని కేటాయించాలి

కళాశాల ఏర్పాటై ప్రారంభం కాగానే కొత్త కళాశాలల్లో ఎక్కడా లేని విధంగా విద్యార్థులు చేరారు. కానీ నేను ఒక్కడిని మాత్రమే రెగ్యులర్‌గా వచ్చాను. మిగతా పర్మనెంట్ సిబ్బందిని కేటాయించలేదు. దీంతో బోధనకు సమస్యలు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం గమనించి కళాశాలకు అన్ని సౌకర్యాలతో పాటు, పర్మినెంట్ బోధన సిబ్బందిని కేటాయించాలి.

– రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్, మహమ్మదాబాద్

గదులు సరిపోవడం లేదు



కళాశాలలో అన్ని గ్రూపులకు కలిపి నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో ఒక్కోసారి అందరం కలిసి సైన్స్‌హాల్లో కూర్చొని పాఠాలు వినాల్సి వస్తోంది. క్రీడా సామగ్రి, ఇతర సౌకర్యాలు కూడా లేవు. ముందుగా బోధనా సిబ్బందిని ఏర్పాటు చేస్తే మాలాంటి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– శివ, కళాశాల విద్యార్థి, మహమ్మదాబాద్

సౌకర్యాలు లేవు



ప్రభుత్వ కళాశాలలో సౌకర్యాలు ఎంతో ఉంటాయని చేరాం. కానీ ఇక్కడ మాత్రం ఎలాంటి సౌకర్యాలు లేవు. ముఖ్యంగా టాయిలెట్స్ వంటివి లేక బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు. అన్ని సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది.

– పూజ, కళాశాల విద్యార్థి, మహమ్మదాబాద్

త్వరగా చర్యలు తీసుకోవాలి

మండల కేంద్రానికి కళాశాల మంజూరు కోసం ఎంతగానో కృషి చేశాం. బోధన సిబ్బంది లేకుంటే గ్రామస్తులమంతా కలిసి పాఠశాల ఫండ్‌ను ఖర్చుచేస్తూ లెక్చరర్లను పెట్టి బోధన చేయిస్తున్నాం. పర్మినెంట్ భవనం, లెక్చరర్ల కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– రాంలాల్, మాజీ సర్పంచ్

సిగ్నల్‌గడ్డ సమస్య పరిష్కరిస్తాం



నేషనల్ హైవే అథారిటీ రీజనల్ హెడ్ కృష్ణప్రసాద్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: పట్టణంలోని సిగ్నల్‌గడ్డ రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తిగాకపోవడంతో పాటు.. ఏళ్లుగా పనులు కొనసాగడంపై సోమవారం హైదరాబాద్‌లో నేషనల్ హైవే అథారిటీ అధికారులను కలిసి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారికి తెలియజేశారు. సంబంధిత ఫొటోలు, వీడియోలను సైతం చూపించారు. తమ ఫిర్యాదుపై నేషనల్ హైవే అథారిటీ రీజనల్ హెడ్ కృష్ణప్రసాద్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వివరించారు. నెల రోజులలోగా బీటీ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు

సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపాలిటీ పాలకమండలి సభ్యులు సోమవారం జడ్చర్ల సీఐ ఆదిరెడ్డికి ఫిర్యాదు చేశారు. సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు నిర్లక్ష్యంగా కొనసాగుతున్నాయని, ఈ కారణంగా రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని వారు తెలిపారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, చైతన్య, నందకిషోర్‌గౌడ్, శశికిరణ్, మహేశ్, ఉమాశంకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కూలిన కాజ్‌వే: నిలిచిన రాకపోకలు




కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు–గోపన్నపల్లి గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వే ఒక వైపు కూలిపోవడంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వే పై నీరు ఎక్కి పారడంతో గోపన్నపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందే. సోమవారం పైనుంచి వరద నీరు రావడంతో కాజ్‌వే కింద గోడకూలిపోయింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కాగా పీఆర్ఏఈ స్వామి, ఎంపీడీవో ప్రభాకర్ చారి, గ్రామానికి చెందిన కిష్టయ్య సమాచారం మేరకు కాజ్‌వేను పరిశీలించారు.

నిండుకుండలా కొత్తచెరువు

- అలుగు పారి పెద్దచెరువుకు వస్తున్న వరద
- 21 అడుగులకు చేరిన వర్షపు నీరు



నీటితో కళకళలాడుతున్న కొత్తచెరువు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం (వార్డు నం .46) లోని కొత్తచెరువు నిండి అలుగు పారుతోంది. సుమారు 28 ఎకరాల విస్తీర్ణం లోగల ఈ చెరువుకు ఎగువ ప్రాంతం నుంచి కొన్ని రోజులుగా వరద వస్తోంది. దీంతో సోమవారం ఉదయం 21 అడుగులకు చేరి మత్తడి దూకి పాటుకాల్వల ద్వారా పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్) కు వర్షపు నీరు చేరుతోంది. కాగా, సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ, మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తాలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమండ్ చేస్తూ సీఐటీయూ, టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. టీఎస్‌టీయూసీ జిల్లా కార్యదర్శి రాములతో కలిసి మాట్లాడారు. మోదీ మూడోసారి అధికారంలోకి రాగానే నాలుగు లేబర్ కోడ్‌లని అమలు చేయడానికి పూనుకుందని ఆరోపించారు. పని దినాన్ని 12 గంటలకు పెంచుతూ కార్మికుల శ్రమ దోపికి పాల్పడుతుందన్నారు. చంద్రకాంత్, రాజ్ కుమార్, రాములు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం జడ్చర్లలో సీఐటీయూ బ్లాక్ డే నిర్వహించింది. జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కార్మికులు కృష్ణ, సాగర్, చెన్న కేశవులు, నర్సింహులు, అరుణ్‌కుమార్, లక్ష్మమ్మ, దేవమ్మ, చిన్నమ్మ, ఇందిరలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించారు. రైతులకు వ్యతిరేకంగా మూడు చట్టాలను తేవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. శ్రీనివాసులు, నర్సింహులు, ఆనంద్, సత్యనారాయణ, రాజు, సోమ్లా, జగన్, తిమ్మప్ప, నాగప్ప, కటికె మోదీ, రమేష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి



జడ్చర్ల టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై.. సోమవారం మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో కమిషనర్ రాజయ్యకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఈనెల 25న చలో కలెక్టరేట్, అక్టోబర్ 8న చలో హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం వద్ద ధర్నా ఉంటుందని అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సంబంధిత కార్యక్రమాలపై కమిషనర్‌కు సమాచారం అందించామని వెల్లడించారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

మహమ్మదాబాద్: తెలంగాణ ఉపాధ్యాయులకు సర్వీసు నిబంధనలు రూపొందించడానికి నిపుణులచే కార్యశాల ఏర్పాటు చేసినట్లు పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి వేసవిసెలవుల్లో బదిలీలు.. పదోన్నతులు కార్యక్రమాన్ని పూర్తిచేసి విద్యాసంవత్సరానికి ఆటంకం లేకుండా సజావుగా పాఠశాలలు నడవడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కృషి చేస్తున్నదని తెలిపారు. అనంతరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంచందర్ రాథోడ్ ఆధ్వర్యంలో మహమ్మదాబాద్, గండేడ్ మండలాల అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. మహమ్మదాబాద్ అధ్యక్షుడిగా జయసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అన్నపూర్ణ, ఉపాధ్యక్షుడిగా విశాల్, గండేడ్ అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంజీవరెడ్డిలు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌బాబు, భూపతిసింగ్, రమాకాంత్, నాగిరెడ్డి, విశాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: షాద్‌నగర్‌లో ఆదివారం జరిగిన నేషనల్ కరాటే మార్షల్ టోర్నమెంట్‌లో కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థి ఉజేఫ్ షరీఫ్ ప్రతిభచాటాడు. గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించాడు. ఈ మేరకు విద్యార్థిని సోమవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అభినందించారు. ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్‌పటేల్, ప్యాట్రన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



మూసాపేటలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



నవాబుపేటలో..

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. పంచాయతీ కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, సురేష్, సతీష్, మాధవి, సంతోషీ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నవాబుపేట: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం వివిధ శాఖల కాంట్రాక్ట్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేయించారు. మండల వైద్యాధికారి రఫీక్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్ ఉన్నారు.

27న ఎస్‌ఎఫ్‌ఐ మహాగర్జన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 27న హైదరాబాద్‌లో మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ పేర్కొన్నారు. ఈమేరకు పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. అధ్యక్షుడు భరత్, నందు, శివ, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



అడ్డాకుల: వరి పంటలకు తెగుళ్లు సోకుతున్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ సూచించారు. మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన రైతులు సాగు చేసిన వరి పంటలను సోమవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాండం తొలుచు పురుగు, సుడిదోమ, అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు సోకితే రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

ఉయ్యాలల వితరణ

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రి చిన్న పిల్లల విభాగానికి.. పట్టణానికి చెందిన లిటిల్ బర్డ్స్ స్కూల్ యాజమాన్యం పది ఉయ్యాలలను సోమవారం అందజేసింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్, విభాగం హెచ్‌వోడీ సురేష్, లిటిల్ బర్డ్స్ యాజమాన్యం లక్ష్మీ కాంత్‌రావు, సవిత, గైనిక్ హెచ్‌వోడీ సంగీత షా, ఆర్ఎంవోలు జరీనా, దుర్గా పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ



విజేతలతో పీడీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రూరల్ మండలంలోని ధర్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్–17 విభాగం బాల, బాలికలకు వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. అండర్–17 విభాగం బాలురలో ఎంజీపీ ధర్మాపూర్ (ప్రథమ), జెడ్పీహెచ్‌ఎస్ మణికొండ (ద్వితీయ), బాలికల్లో సోషల్ వెల్ఫేర్ పాఠశాల రాంరెడ్డి గూడెం (ప్రథమ), జెడ్పీహెచ్‌ఎస్ గాజులపేట జట్టు (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో ఎండి.సలీం, పీడీ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్‌తోపాటు ఆయా పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పోస్టును ప్రభుత్వ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌కు మాత్రమే ఇవ్వాలని నాయకులు అన్నారు. కానీ అందుకు విరుద్ధంగా పంచాయతీ రాజ్ ఉద్యోగులకు కేటాయించారని వెంటనే వారిని మార్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గత జనవరిలో దరఖాస్తులు చేసుకున్నా.. రాజకీయ ఒత్తిడులతో పంచాయతీరాజ్ వారికి కేటాయించారని పేర్కొన్నారు. నాయకులు నాగరాజు, రమేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్‌స్కీం ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపక బృందం, 80మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి గీతిక (కేజీబీవీ రాజాపూర్), రెండో బహుమతి అర్చన(అడ్డాకల్)కు లభించింది. జిల్లా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీశైలం, సైన్స్ అధికారి శ్రీనివాసులు, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

అభినందన

కోయిల్‌కొండ: మండల పరిధిలోని శ్వేతావిద్యామందిర్ పాఠశాలకు చెందిన 7 మంది విద్యార్థులు స్టేట్‌లెవల్ టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ నరేందర్‌జీ తెలిపారు. వీరిలో సుమిత్ర, కేదారేశ్వరి, అశ్విత, నాగలక్ష్మీ, నందిని, రామ్‌చరణ్, శివయ్య ఉన్నట్లు వివరించారు. సోమవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ సుహార, పీఈటీ వీరయ్య తదితరులు అభినందించారు.

సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ఇటీవల జారీ చేసిన అసంబద్ధమైన మార్గదర్శకాలు సహేతుకం కాదని వెంటనే ఉపసంహరించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలం చెల్లిన 2015 నాటి రేషనలైజెషన్ నిబంధనల ప్రకారం 10 మంది విద్యార్థులకు ఒక టీచర్, 60 మంది వరకు ఇద్దరు టీచర్లు అనే నిబంధన అమలు చేయాలనుకోవడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడమే అవుతుందని, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. 20 మంది విద్యార్థుల వరకు ప్రతి బడికి ఇద్దరు టీచర్లను, తరువాత ప్రతి 20 మందికి ఒక టీచర్‌ను, 50 మంది పిల్లలు ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక టీచర్ ను నియమించినప్పుడే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రస్తుతం మెజారిటీ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయని, ఒక ఉపాధ్యాయుడు 5తరగతులకు ఎలా బోధించాలో అధికారులే తెలపాలని ప్రశ్నించారు. ప్రైవేటు పాఠశాలలకు మేలు చేయడానికి ఇలాంటి ఉత్తర్వులు ఇస్తున్నారా అని మండిపడ్డారు. జులైలో బదిలీ అయిన, పదోన్నతి పొందిన టీచర్ల జీతాలు ఇప్పటి వరకు వారి ఖాతాల్లో జమ కాలేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేతలు నన్ను అభినందిస్తున్నారు

- అమృత్ కుంభకోణం బయట పెట్టినందుకు మెసేజ్‌లు వస్తున్నాయి
- 'అమృత్'అంశంలో రేవంత్‌రెడ్డి, బీజేపీ కుమ్మక్కు బయటపడింది
- సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- 'ఎక్స్'లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అమృత్ టెండర్లలో రేవంత్‌రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతల నుంచి తనకు అభినందన సందేశాలు వచ్చినట్టు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి అక్రమాలపై బీజేపీ నేతల మౌనం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితులను అధ్యయనం చేసేందుకు వెళ్లిన పార్టీ అధ్యయన బృందం సభ్యులను పోలీసులు అరెస్టు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసంక్షేమం కోసమే స్వయంగా డాక్టర్లతో కూడిన తమ పార్టీ ప్రతినిధి బృందం ఆస్పత్రులను సందర్శిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎన్ని పిరికిపంద చర్యలకు పాల్పడినా, ప్రజారోగ్య వ్యవస్థ లోపాలను ఎత్తిచూపుతామని ప్రకటించారు. ప్రభుత్వం నిజాలు దాచని పక్షంలో బీఆర్‌ఎస్ నిజ నిర్ధారణ కమిటీ దర్యాప్తునకు సహకరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పట్టణ పేదలకు ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 400కు పైగా బస్తీ దవాఖానాలను నడపడం రేవంత్ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. ఓ వైపు విష జ్వరాలతో నగరవాసులు నరక యాతన పడుతుంటే, అసమర్థ పాలనలో ఆదుకోవాల్సిన బస్తీ దవాఖానాలకే సుస్తీ చేసిందన్నారు.

కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం చేసే ప్రయత్నం చేశారని, సంఘటన వివరాలు, సునీతాలక్ష్మారెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో సునీతాలక్ష్మారెడ్డి లాంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేమనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎన్ని అరాచకాలకు పాల్పడినా, 60 లక్షల మంది కేడర్ కలిగిన బీఆర్‌ఎస్ కుటుంబం ప్రతీ ఒక్కరికి అండగా ఉంటుందన్నారు.

నెయ్యిపై నిగ్గు తేల్చండి

▶ మొదటి పేజీ తరువాయి

తిరస్కరించిన నెయ్యిలో అది ఉందా? ఆ నివేదిక వెనుక రాజకీయ పార్టీల దురుద్దేశాలున్నాయా? అనే విషయాలను కోర్టు తేల్చాల్సిన అవసరం ఉందని స్వామి తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు.

ఈ ప్రశ్నలపై కమిటీ దృష్టి సారించాలి...

'21.06.2024న టీటీడీ ఈవో మంచి నాణ్యమైన నెయ్యితో శాంపిల్ లడ్డూలు తయారు చేయాలని దేవస్థానం కార్మికులకు చెప్పారు. 17.7.2024న ల్యాబ్‌కు నెయ్యి నమూనాలు ఇచ్చారు. నెయ్యి నాణ్యతపై ల్యాబ్ ఇచ్చిన నివేదికను చూస్తే పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటిపై కమిటీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అసలు పరీక్షకు ఏ నెయ్యిని ఉపయోగించారు? ప్రసాదాలకు ఉపయోగించిన నెయ్యినా? లేక తిరస్కరించిన లాట్‌లోని నెయ్యినా? కల్తీ నెయ్యి సేకరణకు ఏ సరఫరాదారు బాధ్యులు? ఆ నివేదికలో పేర్కొన్న విధంగా ఆ నివేదిక తప్పయ్యే అవకాశం ఉందా? టీటీడీ అంతర్గత పరిశీలన తరువాత నెయ్యిని ఎప్పుడు సేకరించారు? ఎప్పుడు దాన్ని వెనక్కి పంపారు? ఆ నివేదిక విషయంలో రాజకీయ జోక్యం ఏదైనా ఉందా?' అనే అంశాలను స్వామి తన పిటిషన్‌లో ప్రస్తావించారు.

నాణ్యత ఉన్న నెయ్యి ట్యాంకర్లకే అనుమతి...

'తిరుమలలో ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్‌పీవో) ప్రకారం దేవస్థానం ప్రాంగణంలోకి ఆవు నెయ్యి వాహన ట్యాంక్ ప్రవేశించిన వెంటనే సంబంధిత అధికారులు ఆ నెయ్యి నమూనాలను తీసుకుని మౌలిక పరీక్షలు నిర్వహిస్తారు. టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నాణ్యతకు అనుగుణంగా ఆ నెయ్యి నమూనాలు ఉన్నట్లు ఆ పరీక్షల్లో తేలితేనే ఆ నెయ్యిని శ్రీవారి లడ్డూతో సహా అన్ని ప్రసాదాల్లో వినియోగించేందుకు వాడతారు. పరీక్షల్లో విఫలమైన నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపేస్తారు. ఇందులో ఎలాంటి రాజీ ఉండదు. దశాబ్దాలుగా ఈ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. అందువల్ల కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో ఉపయోగించారన్నది అవాస్తవం. 'ద ప్రింట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో టీటీడీ ఈవో ఆ నెయ్యిని 100 శాతం ఉపయోగించలేదని స్పష్టంగా చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా లడ్డూ విషయంలో తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు భక్తులను తీవ్రంగా ప్రభావితం చేశాయి' అని స్వామి నివేదించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రకటనలు...

'కొందరు వ్యక్తులు ఓ చిన్న కాగితంలోని కొంత సమాచారాన్ని పట్టుకుని దాని ఆధారంగా రాజకీయ ప్రకటనలు చేశారు. వాస్తవానికి దేని ఆధారంగా అయితే వారు రాజకీయ ప్రకటనలు చేశారో అది ప్రజా బాహుళ్యంలో లేదు. దీనిపై తీవ్ర రాజకీయ ప్రతిఘటన మొదలైంది. వెంకటేశ్వరస్వామిని కొలిచే కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. అతి సున్నితమైన విషయాన్ని ఉద్దేశపూర్వకంగా మీడియాకు లీకు చేసి దానిపై రాద్ధాంతం మొదలుపెట్టారు. ఆ సమాచారాన్ని బహిర్గతం చేసిన వ్యక్తులు అలా చేయడానికి ముందు దాన్ని టీటీడీ యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చి వాస్తవాలను నిర్ధారించుకోవాల్సింది. అయితే అలా చేయకుండా రాజకీయ ప్రయోజనం కోసం ప్రకటనలు చేయడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో మొత్తం వ్యవహారంలో జోక్యం చేసుకోవాలి' అని సుబ్రమణియన్ స్వామి తన పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు.

స్వతంత్ర విచారణ జరిపించండి

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించండి
- లోతైన విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల లడ్డూ వ్యవహారంలో స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈమేరకు వైవీ సుబ్బారెడ్డి తరుఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. లడ్డూకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ల్యాబ్‌పై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని అందులో కోరారు. ఆ నివేదికలో పేర్కొన్న నెయ్యిని ఎక్కడ నుంచి సేకరించారన్న దానిపై కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అభ్యర్థించారు. లడ్డూపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తూ శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న నేపథ్యంలో దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ వ్యవహారాన్ని ప్రచారం చేయడం గానీ, ప్రచురించడం గానీ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, టీటీడీ ఈవోలతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్స్, వనస్పతి ఉన్నట్లు ఈ ఏడాది జూలై 23న ఈవో చెప్పారని నివేదించారు. రెండు నెలల తరువాత సీఎం చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం ఈవో చెప్పిన దానికి భిన్నంగా జంతు కొవ్వులు ఉన్నట్లు చెబుతూ భక్త సమాజంలో తీవ్ర ఆందోళన రేకెత్తించారన్నారు. ఈవో, ముఖ్యమంత్రి చెప్పిన మాటలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఏ నివేదికపై ఆధారపడి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలు చేశారో అందులోనే తమ నివేదిక తప్పయ్యే అవకాశం కూడా ఉన్నట్లు స్పష్టంగా పేర్కొన్నారన్నారు.

ఆ నెయ్యి వాడలేదు..

- చంద్రబాబును అడ్డంగా బుక్ చేసిన లోకేశ్
- తండ్రి చెప్పిన దానికి భిన్నంగా తనయుడి ట్వీట్

సాక్షి, అమరావతి: ఆ వెంకటేశ్వరస్వామే తనతో నిజాలు చెప్పించారేమో అని చెబుతున్న సీఎం చంద్రబాబు తన తనయుడు నారా లోకేశ్ వ్యాఖ్యలతో అడ్డంగా దొరికిపోయారు!

శ్రీవారి సాక్షిగా తండ్రీ కుమారుడు తమ బండారాన్ని తామే బయటపెట్టుకున్నారు!!

టీటీడీ లడ్డూల తయారీకి వినియోగించిన నెయ్యి విషయంలో చంద్రబాబు చెబుతున్న దానికి పూర్తి విరుద్ధంగా లోకేశ్ సోమవారం ఎక్స్‌లో ట్వీట్ చేయడంతో టీడీపీ శ్రేణులు కంగుతిన్నాయి. జంతు వుల కొవ్వు కలిపిన ఏఆర్ డెయిరీ నెయ్యిని లడ్డూల తయారీకి ఉపయోగించారని, వాటిని భక్తులు తిన్నారని చంద్రబాబు పదేపదే అబద్ధాలు చెప్పి నమ్మించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. కానీ లోకేశ్ మాత్రం తాజాగా ట్వీట్‌లో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి లారీలు నాలుగింటినీ టీటీడీ తిప్పి పంపించేసిందని వెల్లడించి సీఎం స్థానంలో కూర్చున్న తన తండ్రి వచ్చి అబద్ధాల కోరని నిరూపించారు. నాలుగు నెయ్యి లారీలను తిప్పి పంపిన టీటీడీ రిపోర్టును తన ట్వీట్‌కు జత చేశారు. అందులో ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన 8 నెయ్యి ట్యాంకర్లలో నాలుగు టెస్టుల్లో పాసవగా, నాలుగు ప్రమాణాల ప్రకారం లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు స్పష్టంగా పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పేది నిజ మా? లేక లోకేష్ చెప్పేది నిజమా? అబద్ధాలు చెప్పడంలో ఇద్దరి మధ్యా సమన్వయం లేదా? కుమారుడికి అబద్ధాల ట్రెయినింగ్ సరిగా ఇవ్వలేదా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది.

జూన్ 12న తొలి ట్యాంకర్ టీటీడీకి

లోకేష్ చేసిన ట్వీట్‌ను బట్టి ఏఆర్ డెయిరీ నెయ్యి సరఫరా చేయడం ప్రారంభించింది చంద్రబాబు సీఎం పీఠం ఎక్కిన రోజు నుంచేనని స్పష్టమైంది. జూన్ 12వ తేదీన ఏఆర్ డెయిరీ నుంచి తొలి ట్యాంకర్ టీటీడీకి చేరింది. అదే నెల 21, 25న రెండు, జూలై 4వ తేదీన మరో ట్యాంకర్ వచ్చాయి. మొత్తం నాలుగు నెయ్యి ట్యాంకర్లు టీటీడీ నిర్వహించిన పరీక్షల్లో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఉన్నాయని తేలింది. అందుకే వాటిని స్వీకరించారు. ఆ తర్వాత జూలై 6వ తేదీన వచ్చిన రెండు ట్యాంకర్లు, 12న వచ్చిన మరో రెండు ట్యాంకర్లు ప్రమాణాల ప్రకారం లేకపోవడంతో టీటీడీ వాటిని తిరస్కరించింది. లోకేష్ జత చేసిన రిపోర్టులో ఈ విషయం స్పష్టంగా ఉంది. లేబొరేటరీ పరీక్షల్లో ఈ నాలుగు ట్యాంకర్లను తిరస్కరించారంటే అందులోని నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగించలేదని విస్పష్టంగా తెలుస్తోంది. కానీ చంద్రబాబు ఆ నెయ్యిని వాడేసినట్లు, వాటితో తయారైన లడ్డూలను భక్తులను తినేసినట్లు చెబుతూ జనాన్ని తప్పుదోవ పట్టించారు. ఆయన కుమారుడు మాత్రం అది తప్పని, ఆ నెయ్యిని వాడలేదని, భక్తులు తినలేదని అసలు విషయాన్ని బయటపెట్టి తమది పక్కా రాజకీయమని తేల్చేశారు.

బాబు గద్దెనెక్కిన రోజు నుంచే సరఫరా

ఈ ఏడాది మార్చి 12వ తేదీన కేజీ రూ.319.20 చొప్పున 10 వేల టన్నుల నెయ్యి సరఫరా కోసం టీటీడీ టెండర్లు



పిలిచింది. మే 8వ తేదీన టెండర్లు ఖరారై ఏఆర్ డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కింది. టెండర్లు పిలిచి ఖరారు చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అయినా సరఫరా ప్రారంభమైంది మాత్రం టీడీపీ హయాంలోనే. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే ఏఆర్ డెయిరీ నెయ్యి టీటీడీకి రావడం మొదలైంది. అప్పుడు కూడా ఆ నెయ్యిని మూడుసార్లు పరీక్షించి ప్రమా ణాల ప్రకారం లేని ట్యాంకర్లను వెనక్కి పంపేశారు. ఈ విషయాన్ని దాచిపెట్టిన చంద్రబాబు కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆ నెయ్యిని వాడేశారని, వాటితో లడ్డూలు తయారు చేసేశారని, వాటిని భక్తులు తినేశారని, దీనికి జగనే కారణమని అబద్ధాలు చెబుతూ దేవుడి సాక్షిగా నమ్మక ద్రోహానికి పాల్పడ్డారు. ఈ విషయం లోకేష్ ట్వీట్ ద్వారా బయటపడడం గమనించాల్సిన విషయం. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి ఇష్టం వచ్చినట్లు అడ్డగోలు భాషలో అడ్డంగా మాట్లాడే క్రమంలో లోకేష్ మరోసారి తాను పప్పునని బయట పెట్టుకున్నారు. వైఎస్ జగన్‌ను ఉద్దేశించి కొవ్వు ఎక్కువైందంటూ అధికారం అండతో అహంకారంతో అభ్యంతరకరమైన పద జాలాన్ని ఉపయోగించిన లోకేష్ అదే ట్వీట్‌లో తమ బాగోతాన్ని బహిర్గతం చేశారు. శ్రీవారి జోలికి వెళ్లి చేయకూడని చెత్త రాజకీయాలన్నీ చేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు ఆయన కుమారుడికి దేవుడి కోర్టులోనూ, ప్రజా కోర్టులోనూ శిక్ష పడడం ఖాయమని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

తిరుమల పవిత్రత దెబ్బ తీయకండి..

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయ లబ్ధికోసం తిరుమల ప్రతిష్టను, పవిత్రతను దెబ్బతియ్యొద్దని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూపై ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఎంతో బాధించాయన్నారు. శ్రీవారి ప్రసాదంలో కల్తీ చేయాలని టెర్రరిస్టులు కూడా ఆలోచన చేయరన్నారు. ఇక్కడి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పుత్తా ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. కేవలం రాజకీయం కోసమే చంద్రబాబు విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తిరుమల లడ్డూపై తప్పుడు ప్రచారం మంచిది కాదని హితవు పలికారు. మహానేత రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనూ ఇదే తరహాలో నిందలు వేశారని శ్రీకాంత్‌రెడ్డి గుర్తుచేశారు. తిరుమలలో కూడా స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని ఒక వ్యక్తి పిటిషన్ వేసిన సమయంలో కోర్టుకు సమాధానం ఇవ్వడంలో భాగంగా 27 చదరపు కిలోమీటర్ల వరకు హోలీసిటీ ఉండాలని, రాజకీయాలు ఉండొద్దన్న ఉద్దేశంతో వైఎస్ జీఓ ఇస్తే దానికి వక్రభాష్య చెబుతూ రెండుకొండలు చేశారంటూ నానాయాగీ చేశారన్నారు.

350.356 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

- జూరాలకు 17వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ధరూరు: జూరాలకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రానికి 17వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు వివరించారు. విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లలో ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ఇందుకోసం 16,200 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నారు. మొత్తంగా 18,625 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.480 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వివరించారు. సోమవారం నాలుగు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 78 మెగావాట్లు, 188.300 ఎంయూ, దిగువలో 80 మెగావాట్లు, 162.056 ఎంయూ ఉత్పత్తి చేపట్టామన్నారు. ఇప్పటివరకు 350.356 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 875.2 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం నీటిమట్టం 875.2 అడుగుల వద్ద 164.7532 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాగా జూరాల నుంచి 16,200 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. భూగర్భ కేంద్రం, ఏపీజెన్‌కో కుడిగట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి మొత్తం 60,944 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వార 21,250 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,560, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.369 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 2.830 మి.యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 800 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 1150 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 858 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే 'హైడ్రా'



కోస్గిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

కోస్గి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాను తెరపైకి తెచ్చారని.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలో పెద్దగా మార్పు లేదని, ఇరుపార్టీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. సోమవారం కోస్గిలో పార్టీ కార్యాలయం, పార్టీ సభ్యత్వ నమోదును ఆమె ప్రారంభించిన అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హైడ్రా పేరుతో చేస్తున్న హంగామా అంతా నాలుగు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల ఖర్చులకు డబ్బు సంచులు పంపించడానికేనన్నారు. హైడ్రా పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని.. గతంలో బీఆర్‌ఎస్ మాదిరిగానే అరకొర హామీలు అమలు చేస్తూ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని తెలిపారు. నేటికీ రైతు భరోసా ఇవ్వలేదని, పెంచిన ఆసరా పింఛన్లు, మహిళలకు రూ.2,500 చెబుతూ పోతే ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. అభివృద్ధి పేరుతో సీఎం తన సొంత నియోజకవర్గంలోని ఆలయ భూములు, ఫార్మాసిటీ పేరుతో పేదల భూములు లాక్కుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కృష్ణా-వికారాబాద్ కోసం రూ.1,200 కోట్లు ఇచ్చిందని, ముఖ్యమంత్రి పాలమూర్ లిఫ్ట్‌కు ప్రాధాన్యతనిచ్చి కొడంగల్, నారాయణపేటకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బంటు రమేష్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుండుమాల్ నారాయణ, ప్రతాప్‌రెడ్డి, తాలుకా కో-కన్వీనర్ కోటకొండ రాము, నాయకులు శ్రీకాంత్, బద్రీనాథ్, అంబదాస్, పున్నంచంద్, సంపల్లి శ్రీను, మల్లేష్, దేవప్ప తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్..

మద్దూరు: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని.. ప్రతి హామీ అమలుకు నిబంధనలు విధిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. సోమవారం కొత్తపల్లి మండలం నిడ్జింతలో పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా నిస్వార్థంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ అని గుర్తుచేశారు. నాయకులు రమేష్, ప్రతాప్‌రెడ్డి, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడా జ్యోతితో పరుగు తీస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- యువత క్రీడల్లో రాణించాలి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: క్రీడల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో సోమవారం ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి, క్రీడాకారులతో కలిసి మంత్రి రన్ నిర్వహించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, కౌన్సిలర్లు నర్సింహ్మారావు, రహీంపాషా, బాలస్వామి, నయూమ్, శిరీష యాదవ్, శ్రీలక్ష్మీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి మున్సిపాలిటీకి ప్రశంసలు




కల్వకుర్తి టౌన్: వ్యర్థాల నిర్వహణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్న కల్వకుర్తి మున్సిపాలిటీని స్వచ్ఛభారత్ మిషన్ ప్రశంసించింది. వినాయక నిమజ్జనం సందర్భంగా స్థానిక ఎర్రకుంటలో వినాయక విగ్రహాల వ్యర్థాలను తొలగింపు, పట్టణ స్వచ్ఛతపై అభినందించినట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సోమవారం తెలిపారు. ఇలాంటి ప్రశంసలు మరిన్ని వచ్చేలా మున్సిపాలిటీ సిబ్బంది, పాలకుల సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: గూడ్స్ వాహనంలో 18 సంచుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, పోలీసుల తనిఖీలో ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. పూడూరు గ్రామానికి చెందిన బోయ సతీష్ గూడ్స్ వాహనంలో 18 సంచుల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గ్రామ శివారులో పోలీసులు తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న మెడికల్ ఎగ్జిబిషన్



సర్జరీ చేసే విధానాన్ని విద్యార్థులకు తెలియపరుస్తున్న మెడికోలు



ఫోరెన్సిక్ విభాగంలో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

పాలమూరు/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో ఏర్పాటుచేసిన మెడికల్ ఎగ్జిబిషన్ కొనసాగుతోంది. సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఎస్‌వీఎస్‌ను సందర్శించి, స్టాల్స్‌ను పరిశీలించారు. నాలుగో రోజు వైద్య విజ్ఞాన ప్రదర్శనలో కంటి విభాగం, న్యూట్రిషియన్, మానసిక విభాగం, ఫోరెన్సిక్ మెడిసిన్, దంత విభాగాలపై ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేశారు. మొత్తం 25 విభాగాల్లో 1500 స్టాల్స్ ఏర్పాటుచేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం విద్యార్థులు మెడికల్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి స్టాల్స్ ప్రత్యేకత, వివరాలను తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే వారికి భోజనం, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ రెసిడెన్సి డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ డా.కేపీ జోషి, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ కుమార్, శివప్రసాద్, వెంకటరమణమూర్తి, ఆదిబాతాజ్ పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ టోర్నీలో రన్నరప్‌గా బాలికలు

రాజన్నసిరిసిల్ల పట్టణంలో జరిగిన జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టు 4-0 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది. బాలికల జట్టుకు ద్వితీయస్థానం రావడంపై కోచ్ సాధిక్‌అలీ, పీడీలు నాగరాజు, రాఘవేందర్ హర్షం వ్యక్తం చేశారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు